# లక్ష్మీపుత్రుడిని లక్ష మెజారిటీతో గెలిపించాలి


సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- బాన్సువాడలో అవతలి పార్టీకి డిపాజిట్లు గల్లంతు కావాలి
- మోదీ పసుపు బోర్డు దింపుడుగల్లం ఆశ...
- కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ జాతికి ద్రోహం చేసిన పార్టీలే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్
- నిజామాబాద్‌లో గల్లీ మనిషిలా మోదీ మాటలు : స్పీకర్ పోచారం
- బాన్సువాడలో రూ.135.15కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నిజామాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/బాన్సువాడ : రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గంలో లేని విధంగా సుమారు రూ.10 వేల కోట్లతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన లక్ష్మీ పుత్రుడు పోచారం సీనన్నను లక్ష మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం బాన్సువాడ పట్టణంలో రూ.135 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారాంతపు సంతలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కృతజ్ఞత సభలో ప్రసంగించారు. కేసీఆర్ ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పేదల కోసం 11 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేయించుకున్న గొప్ప వ్యక్తి, మాలాంటి ఎందరో యువనాయకులకు పితృ సమానులు స్పీకర్ పోచారం సీనన్న అని తెలిపారు.1976లో రాజకీయాల్లోకి వచ్చిన సీనన్న సుమారు 40 సంవత్సరాలు ఆయా ప్రభుత్వాల పని తీరుపై సీనన్న అడగగా ఎంతో మంది సీఎంలు, ప్రభుత్వాలను చూశానని ప్రజల మౌలిక వసతుల కోసం సీఎంలకు దండాలు పెట్టినా, యుద్ధాలు చేసినా నిధులు ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారని ఈ సందర్భంగా కేటీఆర్ సభలో గుర్తు చేశారు. ఆకాశం నుంచి భువికి గంగను తీసుకొచ్చిన విధంగా సీఎం కేసీఆర్ వేలాది కోట్ల రూపాయలను వెచ్చించి కాళేశ్వరం నీటిని తెచ్చి పైన ఉన్న ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌లను నిండుకుండలుగా మార్చారని, రైతులకు రెండు పంటలకు సరిపడా నీటినందించి బీడు భూములను సస్యశ్యామలం చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మొదటి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న పోచారం హయాంలోనే రైతుబంధు పథకాన్ని తెచ్చారని వారి మనుమళ్లు, మునిమనవళ్లు దర్జాగా చెప్పుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా బాన్సువాడ నియోజకవర్గంలో తొమ్మిదిన్నరేండ్లలో రూ.పది వేల కోట్లతో స్పీకర్ పోచారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు.

**కాంగ్రెస్, బీజేపీ పైసలిస్తే కడుపునిండా తీసుకొని ఓటు కారుకు వేయండి..**

బాన్సువాడ ప్రజలు ఆలోచన చేయండి బాన్సువాడ బాగుపడ్డదా.....పాడయ్యిందా అని మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల గుజరాత్ నుంచి బీజేపీ, కర్ణాటక నుంచి కాంగ్రెస్ పార్టీల నాయకులు డబ్బులు భారీగా తెస్తున్నారని, వాళ్లు పైసలిస్తే ప్రజలు కడుపునిండా తీసుకోవాలని, కానీ ఓటు మాత్రం కారు గుర్తుపై పోచారం సీనన్నకు వేయాలని ప్రజలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 70 ఏండ్లలో ఆయా పార్టీలు చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ సహకారంతో స్పీకర్ పోచారం తొమ్మిదిన్నరేండ్లలో బాన్సువాడ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారని మంత్రి కొనియాడారు. ఎన్నికలు వస్తే ఒక్కసారి అవకాశం ఇవ్వమని మోపవుతారని, 60 ఏండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు తాగు, సాగు నీరు ఇవ్వడం చేతకాని పార్టీలు ఒక్కసారి అవకాశం ఇస్తే ఏం చేస్తారన్నారు. 'గూట్ల రాయిని తీయనోడు.....యేట్ల రాయిని తీస్తా డా' అంటూ ఆయా పార్టీలకు చురకలు అంటించారు. ప్రజల ఆశీర్వాదంతో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రానున్నదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ పేరిట ఇండ్లను ఇచ్చారని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.70 వేలు ఇచ్చారని కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల నాలుగు వేలు అందించిందని తెలిపారు. ఒక బాన్సువాడలోనే 11వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు పేదలకు మంజూరయ్యాయంటే, ఇందిరమ్మ ఇండ్లు 70 వేల వరకు ఇచ్చినట్టేనని మంత్రి కేటీఆర్ లెక్కలు చెప్పారు.

**మోదీతో తెలంగాణకు ఒరిగింది సున్నా..**

తెలంగాణకు మోదీతో తొమ్మిదిన్నరేండ్లలో ఒరిగింది సున్నానేనని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి ఒక్క కాలేజీ ఇయ్యలేదు.. స్కూల్ ఇయ్యలేదు. పైసల్ ఇయ్యలే. మన పైసలతో ఉత్తరప్రదేశ్, బీహార్‌లో రోడ్లు వేసుకుంటున్నాడంటూ మండిపడ్డారు. పన్నుల రూపంలో తెలంగాణ నుంచి కేంద్రానికి రూపాయి పోతే మనకు తిరిగి వస్తున్నది కేవలం 46 పైసలు మాత్రమేనని వివరించారు. ఎవరు ఎవరి పైసలతో సోకులు పడుతున్నరో మోదీ చెప్పాలన్నారు. జూటా మాటలు. బూతులు తిట్టి. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే జాకీలు పెట్టినా బీజేపీ ఇక్కడ లేవదన్నారు. బీజేపీ పని అయిపోయిందని చెప్పారు.

**థర్డ్ క్లాస్ ఫెల్లో రేవంత్ రెడ్డి...**

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఒక థర్డ్ క్లాస్ ఫెల్లో అంటూ కేటీఆర్ సంబోధించారు. ఓటుకు నోటులో దొరికినోడి కథే ఇప్పుడు సీటుకు నోటు నడుస్తున్నదని కాంగ్రెసోళ్లే చెబుతున్నారని చెప్పారు. ఇలాంటోడు రాష్ట్రాన్ని టోకుగా అమ్మేయ్యడా. ఇసుంటోడి చేతిలో రాష్ట్రం పెడుతామా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్ననాడు రూ.200 పింఛన్ ఇచ్చినోడే ఇప్పుడు రూ.4వేలు ఇస్తానంటే నమ్ముదామా అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటవుతున్నాయని గత ఎలక్షన్లా నిజామాబాద్, కరీంనగర్‌లో అదల్ బదల్ మాదిరిగా ఓట్లేసుకున్నారని గుర్తు చేశారు. ఈ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు.

## కేసీఆర్ వెంట కోట్లాది మంది జనం...



నిన్న నిజామాబాద్‌కు వచ్చిన ప్రధాని హోదా మరిచి వ్యాఖ్యలు చేశారని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. పీఎం అంటే హోదా. హుందాతనం ఉండాలి. నిజం ఉండాలి. స్పష్టత ఉండాలి. గల్లీ మనిషిలా ఢిల్లీ నుంచి నిజామాబాద్‌కు వచ్చి పిచ్చిమాటలు మాట్లాడారని తెలిపారు. కేటీఆర్ సీఎం కావాలంటే మోదీ అవసరం లేదని, మా ఎమ్మెల్యేలు లేమా అంటూ ప్రశ్నించారు. హోష్‌లో ఉండి మాట్లాడిండా అంటూ అనుమా నం వ్యక్తం చేశారు. మొన్నటి ఎన్నికల్లో 105 బీజేపీ స్థానాలకు డిపాజిట్ రాలేదని ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉం టుందన్నారు. కేసీఆర్ వెంట కోట్లాది మంది ఉన్నారనే భయంతోనే మోదీ వ్యాఖ్యలు చేశారని చెప్పా రు. ఐటీ సెక్టార్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపిన వ్యక్తి కేటీఆర్ అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో సాగునీరు, తాగునీరు, రోడ్లు, చెక్‌డ్యామ్‌లు, లిఫ్ట్ ఇరిగేషన్, వైద్యం, విద్య, సంక్షేమ కార్యక్రమాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు సాధించుకున్నామని చెప్పారు. ఇవన్నీ కలుపుకొని లెక్కగడితే రైతుబీమా 14వేల మందికి, కల్యాణలక్ష్మి 15వేల మందికి, కేసీఆర్ కిట్లు 30వేల మందికి, డబుల్ బెడ్ రూం 11వేల మందికి, గొర్లు 7500 మందికి, 250 చెరువుల్లో ఉచిత చేపపిల్లలు. మొత్తం 9 ఏండ్లలో కేసీఆర్ వచ్చాక ఫలాల విలువ రూ.10 వేల కోట్లకు చేరిందని చెప్పారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 500 కోట్లు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ తీసుకున్నామని తెలిపారు. బాన్సువాడలో ముగ్గురు ఎమ్మెల్యేలు అంటూ పిచ్చి కూతలు కూసిన వారిపై పోచారం మండిపడ్డారు. ఒక కూలీకి ముగ్గురం పని చేస్తున్నామని చెప్పారు. అలాంటి పిచ్చివాళ్లకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. తాను ప్రజలకు బాకీ లేనని, ప్రజలే ఓటు రూపంలో బాకీ ఉన్నారని స్పీకర్ అభివర్ణించారు. ఓటేసి బాకీ తీర్చుకుంటే మళ్లీ ప్రజలకు అభివృద్ధి రూపంలో బాకీ ఉంటానంటూ పోచారం చెప్పారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఐడీసీ చైర్మన్ వేణుగోపాల చారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దఫేదార్ రాజు, పోచారం సురేందర్ రెడ్డి, డాక్టర్ పోచారం రవీందర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిక్కిం వరదల్లో గల్లంతైన సైనికుల్లో కుమ్మన్‌పల్లి వాసి గంగాప్రసాద్

### బాధితుడి బంధువులను విమానంలో సరిహద్దుకు పంపిస్తున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్


లాన్స్ నాయక్ ఎన్‌జీ ప్రసాద్

బోధన్, అక్టోబర్ 4 : భారత – చైనా సరిహద్దులో విధి నిర్వహణ పూర్తి చేసుకుని పశ్చిమ బెంగాల్‌లోని తమ క్యాంప్‌నకు తిరుగుప్రయాణంలో వరదల్లో సైనిక అధికారులు, సైనికులు గల్లంతైన విషయం తెలిసిందే. ఇందులో సాలూరా మండలం కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన నీరడి గంగాప్రసాద్ ఉన్నట్లు సైనిక అధికారులు కుటుంబీకులు బుధవారం తెలిపారు. దీంతో గంగాప్రసాద్ కుటుంబీకులతోపాటు గ్రామస్తుల్లో ఆందోళన నెలకొన్నది. భారత – చైనా సరిహద్దుకు పశ్చిమబెంగాల్‌లోని క్యాంప్ నుంచి లాన్స్‌నాయక్ గంగాప్రసాద్ బృందం కొద్ది రోజుల క్రితం వెళ్లింది. అక్కడ విధి నిర్వహణను ముగించుకొని వస్తూ.. రెండు రోజుల క్రితం రాత్రి సిక్కిం రాష్ట్రంలోని ఓ ప్రాంతంలో ఆ బృందం బస చేసింది. వీరు బసచేసిన పక్కనే నది ఉండడం, భారీవర్షాలకు ఆకస్మికంగా వరదలు రావడంతో చూస్తుండగానే.. 23 మంది సైనికులు, సైనిక అధికారులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ, గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. సైన్యంలో గంగాప్రసాద్ లాన్స్‌నాయక్ ర్యాంక్‌తో పనిచేస్తున్నారు. గంగాప్రసాద్‌కు తండ్రి కాశీరాం.. గతంలో వీఆర్వోగా పనిచేసి, ప్రస్తుతం బోధన్ మున్సిపాలిటీలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గంగాప్రసాద్‌కు తల్లి, తమ్ముడు సాయిసుధాకర్ ఉన్నారు. 2015లో శిరీషను వివాహం చేసుకున్న గంగాప్రసాద్‌కు 3, 7 సంవత్సరాల వయస్సున్న కుమారులు ఉన్నారు.

**స్పందించిన బోధన్ ఎమ్మెల్యే..**
**బాధిత కుటుంబసభ్యులు వెళ్లేందుకు విమానం టిక్కెట్లు బుక్ చేసిన షకీల్**

లాన్స్‌నాయక్ గంగాప్రసాద్ కుటుంబసభ్యులను సిక్కిం ప్రాంతానికి పంపేందుకు బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ చేయూతను అందించారు. గంగాప్రసాద్ గల్లంతయిన విషయమై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి సరిహద్దులోని బార్డోగ్రా ప్రాంతానికి వెళ్లేందుకు విమానం టిక్కెట్లను తన సొంత ఖర్చుతో బుక్‌చేశారు. గంగాప్రసాద్ గల్లంతయిన ప్రాంతానికి ఆయన సోదరుడు సాయి సుధాకర్, బంధువు దిలీప్.. కుమ్మన్‌పల్లి నుంచి బయల్దేరారు.

# పరిపాలన సౌలభ్యం కోసమే కార్యాలయాలు


సమీకృత మండల కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- నస్రుల్లాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

నస్రుల్లాబాద్, అక్టోబర్ 4 : పరిపాలన సౌలభ్యం కోసం నూతన కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ. 1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవన సముదాయాన్ని, అంగన్‌వాడీ భవనాలు, గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. గంగమ్మ ఆలయం, రూ.20 లక్షలతో అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 376 లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం ద్వారా మంజూరు పత్రాలను అందజేశారు. 73 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలకు మంజూరైన క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఇండ్లు లేని నిరుపేదలందరికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, ఆర్డీవో భుజంగరావు, ఎంపీపీ పాల్త్య విఠల్, జడ్పీటీసీ సభ్యురాలు జన్నూబాయి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజి రెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుబ్రమణ్యం, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మాజీద్, విండో చైర్మన్లు మారుతి, గంగారాం, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**FOR LEASE/RENT**

★1000 Sq.ft కమర్షియల్ స్థలం (గ్రౌండ్ ఫ్లోర్), ఇ.నెం.5-5-255, వివేకానందకాలనీ, ప్రియడిలక్స్ రోడ్, కామారెడ్డి నందు లీజ్/కిరాయికి ఇవ్వబడును. సం॥ 8185975007, 9849567007
NTZ-309190

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో॥ + వ॥ + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-

**CHANGE OF NAME**

★I MOHAMMAD SAMI S/O.SHAREEF(OLD NAME) R/o .H.No: 5-5-225/B,Vivekananda Colony,Kamareddy Town & Dist . I Have Changed My Name As **MOHAMMAD SAMI AHMED S/o SHAREEF**(New Name)
NTZ-318503

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.